# పంజరం విరిగింది

"నాన్నా! నా పెళ్ళికేం తొందర! నాకు చదువుకోవాలని వుంది!" అంది లక్ష్మి తండ్రితో. కాని ఆమె తండ్రి కేశవరావు ఆమె మాటలు వినదలచుకోలేదు.

"నీకు తొందర లేదేమో! నాకు తొందరగానే వుంది! మంచి సంబంధం మనమనుకున్నప్పుడు రాదు!" అన్నాడు కేశవరావు. అతని గొంతులో ఎక్కడా మార్దవం లేదు. భార్య జయ వైపు తిరిగి-

"ఏమిటే! నచ్చజెప్పు దానికి!" అన్నట్లుగా చూసాడు కేశవరావు చిరాకును ముఖంలో పులిమేసుకొని.

"లక్ష్మీ! నాన్నగారన్నట్లు మంచి సంబంధాలు మనమనుకున్నప్పుడు దొరకవు! ఈ అబ్బాయి ఐపిఎస్‌కు సెలక్టు అయ్యాడట! అతనికి మంచి భవిష్యత్తు వుంది. కుటుంబం మంచిది. అన్నిటికన్నా ముఖ్యం వాళ్ళు నువ్వంటె ఇష్టపడ్తున్నారు. ఇష్టపడ్డారు కాబట్టే పెళ్ళి చూపులకు వస్తామని చెప్పి పంపారు. ఇప్పుడు నీవిట్లా మొండికేస్తే"

"అది కాదమ్మా! నేనింకా చదువుకోవాలనుకుంటున్నాను. నేను సి.ఏ. చేయాలి. నా కేరియరు నేను ఏర్పరచుకోవాలి. నాకు నా కేరియరు ముందు! పెళ్ళి తర్వాత!" అంది లక్ష్మి తల్లిని బతిమాలు తున్నట్లుగా.

"చూసావా? దాని మాటలు కేరియరేమిటి! ఆడపిల్లకు కేరియర్ ఎందుకు? దానికి సంపాదించాల్సిన అవసరమేముంది! తిని కూర్చోక!" అన్నాడు కేశవరావు కోపంగా.

"కాస్త ఆగండి! నేను అమ్మాయికి నచ్చజెప్తాను" అంది జయ భర్తతో.

ఇటువంటి విషయాల్లో కోపం పనికిరాదు ప్రేమతో చెప్పాలని ఆమె తెలుసుకుంది. లక్ష్మి తల్లి మాటలు వింది. తల్లి ధోరణి ఆమెకు నచ్చలేదు.

"అమ్మా! నచ్చజెప్పడం అవన్నీ చెయ్యొద్దు నువ్వు. నేను ఇంతకుముందే నిశ్చయించు కున్నాను. నేను సి.ఏ. అయ్యేంతవరకు పెళ్ళి గురించి ఆలోచించను!" అంది లక్ష్మి దృఢంగా.

"చదువుదేముంది లక్ష్మీ! పెళ్ళయ్యాక కూడా చదువుకోవచ్చు!"

"అమ్మా! నాకు నా కేరియరు కావాలి! నా శక్తిని నేను నిరూపించుకోవాలి! అప్పుడే నా కేరియరును నా శక్తి సామర్థ్యాలను గుర్తించినవాడ్నే పెళ్ళి చేసుకుంటాను. అంతవరకు పెళ్ళి మాట ఎత్తకు నువ్వు" అంది లక్ష్మి.

"పెళ్ళి మాట ఎత్తవద్దు! - అంటావేమిటే! మా కాలంలో అయితే పెళ్ళి అంటేనే సిగ్గుపడిపోయే వాళ్ళం. నోట్లో నుంచి మాట వచ్చేది కాదు! ఈ కాలం ఆడపిల్లల ధోరణి అర్థమే కావడం లేదు!" విస్తుపోయింది జయ.

"అమ్మా! నీకిదంతా అర్థం కాదు. ప్రతి శుక్రవారం వ్రతమంటూ ఉపవాసం చేసి నాన్నగారి కాళ్ళకు మొక్కి అప్పుడు భోంచేస్తావు. నీ ప్రపంచమంతా నాన్నగారి చుట్టూ తిరుగు తుంది! నీలాగా నేను నా జీవితాన్ని గడపదలచుకోలేదు! నా వ్యక్తిత్వాన్ని నేను ముందు నిలుపుకోవాలని నాకాశ! నా సామర్థ్యాన్ని నేను నిరూపించుకోవాలి! అప్పుడే పెళ్ళి గురించి ఆలోచిస్తాను" అంది లక్ష్మి తల్లితో.

"ఈ కాలం ఆడపిల్లలకు రోజురోజుకు ఆడతనమే లేకుండాపోతున్నది!' అని జయ నిట్టూర్చింది.

"అమ్మా! నేను సి.ఏ. కోచింగు క్లాసుకు పోతున్నాను. వచ్చేసరికి లేటవుతుంది!" అని లక్ష్మి గబగబా బయట నిలబెట్టి వున్న తన కెనెటిక్ హోండా వైపు దారి తీసింది.

తల్లి లక్ష్మివైపు నివ్వెరపోతూ చూసింది. తేరుకొని భర్తవైపు చూసింది.

"ఇప్పుడే పెళ్ళి వద్దని అది మొండిపట్టు పడ్తున్నది! ఎట్లా!" అంది నిస్సహాయంగా.

"మొండిపట్టు ఏమిటి? నీ పెంపకం గారాబం ఎంత దూరం వెళ్ళిందో చూడు! తల్లీ తండ్రీ అంటె ఎంత నిర్లక్ష్యమో తెలుస్తున్నది. నువ్వు అప్పుడే చేతులెత్తెయ్యకు! దానికి మళ్ళీ నచ్చజెప్పు! నీకు తెలుసు కదా! ఇది ఎంత మంచి సంబంధమో!" అన్నాడు కేశవరావు.

జయకు ఇద్దరు కొడుకుల తర్వాత లక్ష్మి పుట్టింది. ఇద్దరు పిల్లల తర్వాత పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకొమ్మన్నాడు ఆమె భర్త కేశవరావు. కాని జయే ఒక ఆడపిల్ల కావాలని ముచ్చట పడింది. ఆడపిల్ల వుంటే చక్కగా రకరకాల డ్రెస్సులు వేయవచ్చు. నగలతో అలంకరించవచ్చు. పూలతో అందంగా ముస్తాబు చేయవచ్చు! తన నగలన్నీ పెట్టుకునే ఒక కూతురు కావాలి! కొత్త కొత్త చీరలు, రకరకాల ఫ్యాషన్లతో బొమ్మలా తయారయ్యే ఒక ఆడ పిల్ల కావాలి - అని జయ ఆరాటపడింది. చివరకు ఆమె కోరుకున్నట్లుగానే ఆమెకు మూడో సంతానం కూతురు లక్ష్మి పుట్టింది.

చిన్నప్పట్నుంచి కూతుర్ని రకరకాలుగా అలంకరించాలనే చూసేది జయ. కాని లక్ష్మికి ఆ అలంకారాలంటే అంత ఇష్టంగా వుండేది కాదు.

లక్ష్మి చిన్నప్పట్నుంచి అన్నలతో ప్రతి విషయంలో పోటీపడేది. అది చూసి జయ లక్ష్మిని మందలించేది. "అదేమిటే! నువ్వు ఆడపిల్లవు! నువ్వు చేయాల్సిన పనులు - నువ్వు ఆడుకోవల్సిన ఆటలు వేరే వుంటాయి! నువ్వు అన్నలతో పోటీపడి మగపిల్లలతో తిరిగితే - ఆడితే బాగుండదు తల్లీ! ఇదిగో చూడు నీ పుట్టినరోజుకు ఎంత చక్కటి జడబిళ్ళను చేయించానో!" అని తల్లి చూపిస్తే చూడకుండానే "అది నాకొద్దు!" అంటూ స్కూలుకు పరిగెత్తింది లక్ష్మి.

ఇద్దరు మగపిల్లలూ ఇంజనీరింగు చదివారు. పెద్దవాడు ఇంజనీరింగు పూర్తిచేసి అమెరికా వెళ్ళిపోయాడు పై చదువులకు. రెండోవాడు ఈమధ్యనే ఇంజనీరింగు పూర్తిచేసి ఎం.బి.ఏ.లో చేరాడు. లక్ష్మి బి.కామ్ ఫైనలియరు పరీక్షలు వ్రాయబోతున్నది. తర్వాత సి.ఏ. చేసి చార్టెడు అకౌంటెంటు కావాలనుకుంటున్నది. లక్ష్మి హైస్కూలు చదువు పూర్తిచేసి కాలేజీలో ఇంటర్‌లో చేరుతానన్నప్పుడే జయకు నచ్చలేదు.

"ఈ ఇంటర్ చదువు చాలించి ఇంటి పనులు నేర్చుకో!" అంది.

కాని లక్ష్మి అట్లా చేయలేదు. ఇంటరు మంచి మార్కులతో ప్యాసై తనకు నచ్చిన బి.కామ్‌లో చేరింది. సి.ఏ. చేయాలని కోచింగు తీసుకుంటున్నది. రోజంతా కాలేజి - సాయంత్రం కోచింగూ అని వెళ్ళే కూతుర్ని చూసి జయ జాలిపడింది. "ఏం చదువులే లక్ష్మీ! హాయిగా ఇంట్లో కూర్చొని సుఖపడక ఈ ఉరుకులు పరుగులు ఎందుకే?" అంది.

లక్ష్మి రెండోఅన్న తల్లి మాటలు విన్నాడు. "ఎందుకమ్మా! నువ్వు దాన్ని డిస్కరేజ్ చేస్తావు. దానికి చదువుకోవాలని వుంది చదువుకోనీ!" అన్నాడు.

"మగాళ్ళతో ఏం పోటీరా! ఆడపిల్ల లక్షణాలేవీ దానిలో నాకు కనిపించడంలేదు!" నిరాశతో అంది జయ.

"అమ్మా! నీ ఇష్టమేమిటో నాకు తెలుసు! నీ నగలన్నీ దిగేసుకొని నేను అమ్మోరిలా తయారు కావాలని నీకిష్టం! అంతేనా!" అంది లక్ష్మి నవ్వుతూ.

"లక్ష్మీ! చక్కగా వేళకు తింటూ ఇంటిపట్టున వుండక ఎందుకే నీకీ కష్టాలన్నీ! నువ్వు చదివి ఉద్యోగం చెయ్యాల్సిన అవసరమేముంది చెప్పు!" ప్రశ్నించింది జయ.

జయ ప్రశ్నిస్తూనే వుంది రోజు. లక్ష్మి కాలేజికి వెళ్తూనే వుంది.

ఈ పెళ్ళి సంబంధం వచ్చేంతవరకు కేశవరావు కూతురేం చేస్తున్నది, ఏం చదువు తున్నది పట్టించుకోలేదు. ఈ ఐపియస్ సంబంధం ఎక్కడ చేయి జారిపోతుందోనని అతనికి భయంగా వుంది. ఈ సంబంధాన్ని ఎగరేసుకపోవడానికి ఎంతో మంది డబ్బు సంచులతో

రెడీగా వున్నారు. తన కూతురు వ్యవహారమతనికి ఏమీ నచ్చలేదు.

ఐపిఎస్ అబ్బాయి లక్ష్మి ఫొటో చూశాడు. అతనికి లక్ష్మి నచ్చింది. పెళ్ళి చూపులకు వస్తామని చెప్పి పంపారు. పెళ్ళిచూపులనేది ఆచారంగా జరిగే వ్యవహారమే! తనకు ఒక్కగానొక్క కూతురు. దాని పెళ్ళి భూదేవంత అరుగు ఆకాశమంత పందిరి వేసి వైభవంగా జరిపించాలని వుంది! తన తాహత్తంతా చూపించుకోవడానికి అదే కదా అదును!

లక్ష్మికి తండ్రి ఏమి తక్కువ చెయ్యడని పిల్లాడివాళ్ళకు తెలుసు! అందుకే వాళ్ళూ లక్ష్మిని చేసుకోవాలని తొందర పడ్తున్నారు. మంచిరోజు చూసుకొని ఫలానారోజు పెళ్ళిచూపులకు వస్తున్నామని వాళ్ళే సందేశం పంపారు. తల్లిదండ్రుల హడావిడి చూసి తొందర్లోనే పెళ్ళిచూపులున్నాయని లక్ష్మి పసిగట్టింది.

"లక్ష్మీ! రెండ్రోజులు ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే వుండు! ఆ హోండా మీద తిరిగి తిరిగి నల్లబడిపోయావు. కారులో వెళ్ళవే అంటే వినవు! రెండ్రోజులు ఇంట్లో వుంటే ఫ్రెష్‌గా వుంటావు. ఎల్లుండి పెళ్ళిచూపులకు వస్తున్నారు!" అంది జయ లక్ష్మితో.

లక్ష్మి పట్టుచీరతో నగలతో ఎట్లా కళకళలాడ్తూ కన్పిస్తుందో జయ మనస్సులో ఊహించుకొని మురిసిపోతున్నది. జయ ముఖంలో ఆనందం ఉప్పొంగుతున్నది.

ఇదేదీ లక్ష్మికి మాత్రం ఆనందంగా లేదు. "వీళ్ళంతా కలిసి నన్ను పంజరంలో బంధించాలను కుంటున్నారు" అని ముఖం మాడ్చుకుంది లక్ష్మి.

ఆమె ముఖంలో ఏ కళా లేదు.

"తన చదువు గురించి అమ్మ ఎప్పుడూ సీరియస్‌గా పట్టించుకోలేదు. ఇంట్లో వుండి ఏం చేస్తుంది! - అని రొటీన్‌గా స్కూలుకు పంపిందేగాని అన్నల చదువు ముఖ్యమైనట్లుగా తన చదువూ ముఖ్యమే అని ఆమె ఎన్నడూ అనుకోలేదు. తనకు మార్కులు ఎక్కువ వచ్చినా తక్కువ వచ్చినా పట్టించుకునేది కాదు. అన్నలకు ట్యూషన్లు పెట్టించినట్లు తనకు ట్యూషన్లు పెట్టించలేదు. నేను చదివినా చదవకపోయినా ఆమెకొక్కటే! ఏ పండుగ వచ్చినా పేరంటం వచ్చినా తనను చక్కగా పట్టు లంగాతో, నగలతో-పూలతో అలంకరించి తీసుకెళ్ళేది. అదంతా తనకిష్టం లేకపోయినా చిన్నతనం కాబట్టి తను ఏం మాట్లాడేది కాదు! కానీ ఇప్పుడూ! నాకేది ఇష్టమో నాకేం కావాలో నాకు తెలుసు! నాకు కావాల్సిందాన్ని సాధించాలని పట్టుదల వుంది! నా భవిష్యత్తును నేను నిర్ణయించుకునే శక్తి వుంది! కాబట్టి ఈ పెళ్ళి చూపుల తతంగాన్ని ఎదిరించే నిలబడ్డాను!" అని నిశ్చయించుకొని తలిదండ్రులున్న డ్రాయింగు రూంలోకి దృఢంగా అడుగులు వేసుకుంటూ ప్రవేశించింది లక్ష్మి.

* * *